"కమలా! నివ్వేమనుకోకుండా వుంటే ఓ మాటంటాను..." చప్పున ఆగిపోయాడు శ్రీధర్ ఆమె మొహంలోకి చూస్తూ,

ఆమె తలవంచుకుంది సమాధానం చెప్పలేదు.

శ్రీధర్ తటపటాయించాడు పస్తా యిస్తున్నాడు చెపుదాం చెపుతే యేం? ఉన్నమాట తప్పేమి అనుకోనీ ఏమన్నా అనుకోనీ 'ఉహూ' మళ్ళీ తనలో తానే వద్దనుకుంటున్నాడు నిజమే అనుకో అయినా అంటం యెందుకు చప్పున మనసులో యేమనుకుంటుందో యేమో ఇన్నేళ్లబట్టీ మాటా పలుకూ

లేకండా వుంటున్నాం. కష్టం సుఖం ఇద్దరం పచ్చుకున్నాం. ఆమెమాట నేనె ప్పుడూ కాదనలేదు నామాటకు ఎప్పుడూ ఎదురుచెప్పునే లేదు అలాంటప్పుడు యీనాడు ఆమెను నొప్పించటం తప్ప యేమీ లేదు. మెదలకుండా వూరుకుంటేనే సరి పోతుంది అబ్బా! ఊరుకుంటే యెట్లా, నా మనస్సులో మాట ఆమెకు తెలిసే దెట్లా! తప్పక చెప్పి తీరుతాను యేమైనా కాని, వెనకముందూ ఊగిసలాడుతూ ఆమె మొహంలోకి చూట్టానికి ప్రయత్నం చేశాడు.

ఆమె యిట్టే విదిలించుకుని చివాలున లేచి నిలబడింది. భర్త మొహంలోకి కొరకొర చూస్తూ రివ్వున లోపలికి వెళ్ళి పోయింది.

చెపుదామనుకున్న మాట చెప్పక పోయిన యింత రుసరులాడి పోతోందే తీరా చెప్పే వుంటే యింకేమన్నా వుండేదా! అమ్మో యివ్వాళ మూడ్ బాగాలేనట్టుంది. మనం చెప్పకపోవడమే నయం. లేచినవేళ మంచిది. ఇంకా చెప్పాను కాదు. నాకు చప్పున తట్టింది వెనక్కు తగ్గను, నయవే! అమ్మయ్య అంటూ సంతృప్తిగా నిట్టూర్చాడు. రెండు జేబుల్లోనూ రెండు చేతులూ పోనిచ్చి నిటారుగా నిలువుటద్దం ముందు నిలబడి దువ్వెనకు అందనిజుట్టును అతి నాజూకుగా అదుపులో పెట్టటానికి తల అటూ యిటూ తిప్పాడు. ఎంతజుట్టు పెంచినా ముందరపడే తల మాత్రం తెల్లగా మెత్తగానే కనపడుతోంది. మొత్తంమీద షేప్ బాగా దెబ్బతిన్నది. అక్కడ తల మీద ముందుకూడా కొంచెం వత్తుగా జుట్టువుండి వుంటే చాలా బాగా వుండేది. గుండ్రటి మొహం వెడల్పయిన చెక్కిళ్ళు సన్నటి ముక్కు వీటిమీద జుట్టుకూడ వత్తుగా వుంటే చాలా బాగుం డేది. ఎన్నిరకాల చాముర్లురాసినా ఎంత ప్రయత్నం చేసినా యేం మార్పు కని పించడం లేదు, పరవాలేదులే అను కున్నాడు. ఈ ఒక్క లోపంవలన మన కొచ్చిన ప్రమాదం యేమీలేదులే అని దిలాసాగా తల వూపేశాడు.

చప్పున వాకిట గుమ్మం దగ్గరకు వెళ్లాడో లేదో ఎదురుగా డాబామీద ఆమెగారు రైలింగ్స్ పట్టుకుని అటూ ఇటూ వూగుతూ నిలబడింది. ఆమె చాలా ఆకర్షణగానూ అందంగానూ కని పిస్తోంది. ఆమెను యెంతసేపు చూసినా తనివితీరకుండా వుంటోంది. ఆమెను చూసిన కళ్ళతో కమలను చూస్తే వళ్ళు గంతరిస్తుంది. మహా చిరాకు పడతాడు, తిటతాడు. తనను తిట్టుకుంటాడు. అంతా లోపల లోపలే అనుకుంటాడు గాని పైకి అనలేదు ఆమె వైపే కళ్ళు అప్పచెప్పి నిలబడిపోయాడు. అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు ఆమె ఆకట్టేసింది. అతను అట్లాగే నిలబడ్డాడు ఆమె కూడా చిరునవ్వుతో శ్రీధర్ వంకే

చూస్తూ కళ్ళు అటూ యిటూ తిప్పు తోంది. శ్రీధర్ మొహం ఎర్రబారింది. పెదిమలు కదిలినాయి. కాని, అటూ యిటూ చూసి తత్తరపడ్డాడు. వెనక్కు తిరిగాడు. కమలేమన్నా వెనకాల నిల బడిందేమోనని. ఆమె అక్కడ లేదు రెండడుగులు ముందుకు వేసి తల పైకెత్తి చూశాడు. ఇంతలోనే ఆ వీధి లోకి ఐర్రున ఓ టాక్సీ వస్తోంది. అతని చూపు డిస్టర్బ్ అయింది. చప్పున ముందుకు నడిచాడు వెనక్కు వెనక్కు చూస్తూ.

మర్నాడు సాయంత్రం షుమారు ఆరు గంటలకు కమల వరండాలో జుట్టు చిక్కు తీసుకుంటోంది.

అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు వాకిట్లో మందార చెట్లలోంచి తళుక్కు తళుక్కుమని మెరుస్తూ కమల జుట్టు మీద పడుతున్నాయి. ఆమె కళ్ళు చిట్లిస్తూ జుట్టు చిక్కు తీసుకుంటోంది. శ్రీధర్ వెనకాలే నిలబడ్డాడు. స్పష్టంగా తెల్లటి వెంట్రుకలు తళతళా మెరు స్తున్నాయి. శ్రీధర్ గతుక్కుమన్నాడు. అతను అదివరకు తన మనస్సులో అనుకున్న ఊహలు నిజమయినాయి. నిజమే నా భార్య ముసలిదయిపోతోంది అనుకున్నాడు నిస్పృహగా. ఈ మాటే కమలతో చెపుదామని చాలాసార్లు అను కున్నాడు కాని చెప్పలేదు. తనలో తాను అనుకుంటూ మొదలకుండా పూరు కున్నాడు. ఇద్దరు సరసాలాడుతున్న ప్పుడు యీ మాట సరదాగా అందామను కుని అది సమయం కాదనుకుని పూరు కున్నాడు మరొకసారి అందామనుకొని బయలుదేరుతుండగా తన రూపు అద్దంలో కనిపించింది. మొహం అంతా పీక్కు పోయింది. నుదురుమీద ముడతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దవడలు అంటుకుపోయినాయి పెదిమల్లో గేరలు కనిపిస్తున్నాయి, పూడిపోయిన దంతం ఒకప్పుడు స్థావరం యేర్పరచుకున్న ఖాళీస్థలం స్పష్టంగా కనబడింది. ముందు పన్ను ఊగిసలాడుతోంది. మొహం చిట్లించి తల పీక్కుని చప్పున వెనక్కు తిరిగి లోపలికి వెళ్ళి పరుపు మీద పడుకున్నాడు.

రాను రాను కమల మాత్రం చాలా అస హ్యంగానూ వికృతంగానూ కనిపిస్తోంది. ఇంట్లోకి వస్తే సరి భార్యను చూట్టానికి విలవిలలాడుతాడు. ఆమెను చూస్తుంటే సరి పక్కింటి సరిత కళ్ళల్లోకి వచ్చి కూర్చుంటోంది. ఇహ శ్రీధర్ మనస్సు ఊగిసలాడుతోంది. భార్యను చూస్తున్నా డన్న మాటేగాని సరితను చూస్తున్నట్లు గానే వుంది. ఆమెతో మాట్లాడుతున్న ట్లుగా ఊహించుకుంటూ భార్యతో మాట్లాడుతున్నాడు. ఆమె కూడ అడిగిన దానికి ముక్తసరిగా సమాధానాలు చెప్తు తోంది. కాని ఆమె మనస్సుకూడా వికలంగావుంది. భార్య వాలకం ఆయన

ప్రవర్తన చూస్తుంటే కమలకు చాలా ఆశ్చర్యంగా వుంది.

ఈ మధ్యనే ఆయన్ను ఏమేమిటో అడుగుదామని తనకున్న అనుమానా లేమిటో తీర్చుకుందామని అనుకుంది. కాని ఎప్పటికప్పుడు ఏదో ఒకటి అడ్డం రావటం ఆ ప్రశ్న లేమిటో తాను వెయ్యక పోవడం జరిగిపోతోంది. కాని, రోజు రోజుకు మాత్రం కమలమనస్సు క్రుంగి పోతోంది. మహా ఆరాటపడుతోంది. కాని ఏమీ చెయ్యలేకపోతుంది. శ్రీధర్‌లో మాత్రం యేమీ మార్పు లేదు అయితే ఒకరికొకరు బాగాఎడమయిపోతున్నారు.

శ్రీధర్ చాలాసార్లు సరితను బాగా దగ్గరగా చూడటం కూడా తటస్థించింది. ఇంకా ఆయనకు ఆమెమీద ఆప్యాయత అనురాగం యెక్కువవుతున్నాయి. కాని ఎప్పటికప్పుడు ఆమెకూ తనకూ యేమీ సంబంధం లేదని ఆమె యింకొకరి భార్య అని ఆమెను అట్టే అట్లా చూడటం కూడా తప్పని శ్రీధర్ మనస్సులో గట్టి గానే నాటుకుంది. కాని ఆమెను చూడందే వుండలేకుండా వున్నాడు. రానురాను ఆమంటే అతనికి చాలా మంచి అభిప్రాయం ఏర్పడింది. అదే కమలతో చెప్పాలని తహతహలాడుతూ వున్నాడు. ఆమె వేసుకున్న డ్రస్సు వేసు కోవాలని, సరిత మాదిరిగా నీటుగా వుండాలని అందంగానూ పడుచుతనంగా వుంటానికి ప్రయత్నించాలని చెపుదామని అనుకుంటున్నాడు. కాని అదెట్లా చెప్ప టమో అర్థంకావటం లేదు. ఎట్లా చెప్పితే బాగుంటుందో ఊహించుకుంటున్నాడు. పొరుగింట సరిత నీకంటె అందంగా వుంటుందీ అని అన్నామంటే చచ్చా మన్నమాటే. దానికి యీ ఆడవాళ్ళు ఎన్నెన్ని అర్థాలైనా చెస్తారు. వాట న్నింటికి సమాధానాలు చెప్పలేక సతమత మయిపోవాలి. ఆమె మంచి డ్రస్సు వేసు కుంటుంది అనంగానే నేమాత్రం వేసుకో వడం లేదా అని చప్పున అనేస్తుంది. అదీ నిజమే. ఆమె ఎప్పుడూ తన శరీరాన్ని నాజూకుగా అందంగా వుంచుకుంటూ, వున్న వయస్సు కంటె తక్కువ వయస్సుదాని మాదిరిగా కనిపిస్తుంది. ఇట్లా అన్నా కూడ తంటాయే. నాకీ నట నలు రావు. యీ భేషాలు అంతకంటె యిష్టంలేదు. అనేస్తుంది. ఏమైనాగాని సరిత కమలకంటె అందంగా వుంటుంది అనే భావం కలిగేట్లు చెప్పాలి కాని ఆ పక్కింటావిడ నీకంటె అందంగా వుటుంది అని నేను అనుకున్నాననే భావన కమలకు కలగకూడదు. మరి యిది యే విధంగా చెపితే బాగుంటుందా అని ఆలోచిస్తూ చాలా తపన. మధన పడుతున్నాను. నాలుగైదు రోజుల్నుంచి ఆ భావంతో దానికి తగిన మాటలతోనూ కుస్తీ పడుతున్నాడు. కాని పాలు పోవడంలేదు, తెమలటంలేదు. అన్నీ సందేహాలే, అన్నీ అనుమానాలే. దీంతో మరీ బాధపడుతున్నాడు.

ఆనాడు సాయంత్రం ఆరుగంటలకు మామూలుగా వరండాలో కూర్చుని సన్నజాజులు గుచ్చుతోంది కమల, ఆమె మొహంలో చిరునవ్వు తాండవ మాడుతున్నాయి. శ్రీధర్ యిట్టే పసి కట్టేశాడు. ఇది మంచి సమయం అనుకున్నాడు. తన మనస్సేమిటో చెప్పేద్దామనుకున్నాడు. ఇప్పుడు యే మాటన్నా పెడర్థం చెయ్యదు నా మాట వింటుంది నా కోరిక తీరుతుంది. నామనస్సు కుదట పడుతుంది. అనుకుంటూ చెంగుచెంగున వచ్చేశాడు.

కమల చప్పున తలెత్తి చూడంగానే శ్రీధర్ కనిపించాడు. మొహం చిట్లించి తల వంచుకుంది. మళ్ళీ తనలో తాను సమాధానపడింది గామాయి చిరునవ్వుతూ తల పైకెత్తి శ్రీధర్ కళ్ళలోకి చూసి నవ్వింది. శ్రీధర్ ఉలిక్కిపడ్డాడు.

"బట్టతల పోగొట్టటానికి ఓ తైలం ఎడ్వర్టైజ్ చేస్తున్నారు మీరు చూశారా." సన్నజాజులు గుచ్చుతూనేవుంది కమల.

"ఆ!..."

"దవడలు పీక్కుపోయి నుదురు మీద ముడతలు పడుతుంటే కూడా డాక్టరి దగ్గరకు వెళ్ళరే మీరు..."

ఆ! ... రెండు చేతుల్తో బుగ్గలు తడుముకుని నుదురు పైకి ంచకూ ఊగించాడు.

"ఈ తెల్లజుట్టుకు మందులేదు. ఏదైనా పట్టించారంటే తెల్లజుట్టల్లా రాగి జుట్టవుతుంది..." పకపక నవ్వుతూనే వుంది కమల. సన్నజాజుల దండా పొడుగవుతోంది.

"ఆ!..."

"మీరేమీ అనుకోకుండా వుంటే నేనో మాట అంటాను...

పెదిమలు చిట్లించి నవ్వాపుకుంటూ "మీరు బాగా ముసలివారయిపోయారండీ..."

"ఆ!..." శ్రీధర్‌కు మూర్ఛ వచ్చినంత పనయింది. తలమీద కుడి అరిచెయ్యి పెట్టుకుని దభాలున కూర్చున్నాడు.

కమల పుచ్చిపోయిన పూలను విడిలిస్తూ మంచి పూలను ఏరుతోంది.

"ఏవండో... ఆ సరితమొగుణ్ని చూశారా ఆయనకు మీ వయస్సే ఉంటుంది. ఆయనెట్లా వున్నాడో చూడండి... నిజంగా మీకంటె చాలా అందంగా వుంటాడు... ఏమంటారు," అంటూ చప్పున వెనక్కు తిరిగింది.

శ్రీధర్ తల వంచుకుని మెదలకుండా ఒక్కొక్క అడుగేవేస్తూ గడపదాటాడు.

కమల పకపక నవ్వుతూ నేనెగతాళికి అన్నానండోయ్... నిజమనుకున్నారేమిటి కొంపతీసి..." బిగ్గరగా అరిచింది.